క్లుప్తంగా

నేడు భారీ ర్యాలీ

పెనగలూరు : బాల్య వివాహాల అరికట్టడంపై మండల కేంద్రంలో నేడు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఏపీఎం నిరంజన తెలిపారు. మండలంలోని ఎస్‌హెచ్‌జీ మహిళలు భారీ సంఖ్యలో పాల్గొనున్నట్లు వారు తెలిపారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి పాల్గొనున్నట్లు వారు తెలిపారు.

సిద్దవటంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే


చేతులను శుభ్రం చేయిస్తున్న వీఓఏ బేబిరాణి

సిద్దవటం : మండలంలో ఆదివారం గ్లోబల్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమం నిర్వహించినట్లు ఈఓపీఆర్డీ పులిరామ్‌సింగ్, వెలుగు ఏపీఎం వెంకటేష్‌లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని అంగన్‌వాడీ సెంటర్‌ల వద్ద, సిద్దవటం ఎగువపేట, దిగువపేట, మాధవరం-1, పార్వతీపురం, లింగంపల్లి, టక్కోలి, గ్రామ సమాఖ్యల వద్ద మహిళలు, చిన్నపిల్లలతో ఆశ వర్కర్‌లు సబ్బుతో, శానిటైజర్‌తో హ్యాండ్‌వాష్ చేయించారు. ఈ చేతులు బాత్‌రూమ్ పోయిన తరువాత, అన్నం తినే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. దీంతో క్రిమీ, కీటకాలు బయలకు వెళ్లిపోయి ఆరోగ్యంగా ఉంటారని వారన్నారు.

ఏర్పాట్ల పరిశీలన


సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న దేవనాథరెడ్డి, రూరల్ సీఐ తులసీరామ్

చిన్నమండెం : మండల పరిధిలోని బోడిరెడ్డిగారిపల్లె గ్రామంలో నేడు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలు పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్‌లు భద్రతా ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు బోడిరెడ్డిగారిపల్లెలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీల నూతన భవనాలను ప్రారంభించనున్నారు.

ఆలయానికి మైక్‌సెట్ వితరణ


మైక్‌సెట్‌ను అందజేస్తున్న దృశ్యం

నందలూరు (రాజంపేట) : కన్యకా చెరువు అలుగు సమీపంలో వెలసిన అనంతపురమ్మ ఆలయానికి నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆయన తల్లి జంబు వెంకట నరసమ్మ జ్ఞాపకార్థం రూ. 20 వేలు విలువజేసే మైక్ సెట్ వితరణ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు తుమ్మల రాజేష్, వెంకటసుబ్బయ్యలు సర్పంచ్ సూర్యనారాయణను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అక్కి వెంకటరమణ, ఎముక దుర్గయ్య, రేగిమడుగు శంకర, తుమ్మాది శివ, ఆది సుబ్బయ్య, శివ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చిట్వేలి : స్థానిక శ్రీ సాయి వికాస్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి రోగులు నుంచి విశేష స్పందన లభించింది. సురేంద్ర కంటి హాస్పిటల్ తిరుపతి వారు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 100 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 30 మందిని ఆపరేషన్ల కోసం సురేంద్ర కంటి హాస్పిటల్ తిరుపతికి తరలించారు. ఆపరేషన్లు అవసరం లేనివారికి ఉచితంగా మందులను పంపిణీ చేశామన్నారు. మధ్యాహ్నం భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో చిన్నారుల నృత్యాలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా నృత్య ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కడప నగరానికి చెందిన వర్షిణి డ్యాన్స్ అకాడమి విద్యార్థులు ఈ సందర్భంగా ప్రముఖ సినీ గీతాలతోపాటు శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. ప్రేక్షకులు పదేపదే కరతాళ ధ్వనులు చేసి వారిని ప్రోత్సహించారు.

వైభవం.. దేవీ శరన్నవరాత్రి ఉత్సవం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలో అమ్మవారి ఆలయాలను ఉత్సవాలకు ముస్తాబు చేశారు. ఆదివారం దసరా నవరాత్రులలో మొదటి రోజు కావడంతో ఆలయాల్లో శుద్ధి చేసి ఉత్సవాలకు అంకురార్పణ జరిపారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌లకు అభిషేకాలు, పూజలు జరిపి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. తదుపరి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని వేర్వేరు రూపాల్లో కొలువుదీర్చారు. వివిధ రూపాల్లో దర్శనమిస్తున్న అమ్మవారిని చూసి తరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాల బాట పట్టారు. వచ్చిన భక్తులకు తీర్థ, అన్న ప్రసాదాలను వితరణ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్


సంబేపల్లె: నల్లగంగమ్మ రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


రాజంపేట టౌన్: దీక్షాబంధనదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు


రాయచోటి టౌన్: అమ్మవారిశాలలో వాసవాంభ రూపంలో కన్యకా పరమేశ్వరి దేవి


లక్కిరెడ్డిపల్లె: బాలత్రిపుర సుందరీ అలంకారంలో..


పెనగలూరు: ప్రత్యేక అలంకారంలో కామాక్షమ్మ


రాజంపేట టౌన్: దర్శనమిస్తున్న వీరచౌడేశ్వరి దేవి


రాయచోటిటౌన్ : చౌడేశ్వరి దేవి రూపంలో..


రామాపురం: శ్రీ రాజరాజేశ్వరి దేవిగా దర్గా మాతాజీ


సిద్దవటం: విశేష అలంకరణలో గంగా భవాని


రాయచోటి టౌన్: దర్శనమిస్తున్న పార్వతీ దేవి


రైల్వేకోడూరు అర్బన్: దీక్షా బంధన దేవి అలంకరణ


రైల్వేకోడూరు అర్బన్: పూజల్లో పాల్గొన్న భక్తులు


రాజంపేట: దీక్షా బంధన అలంకారంలో వాసవీ మాత


ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని అమ్మవారిశాలలో..

యువత 'కలాం' అడుగుజాడల్లో నడవాలి


చిట్వేలి: మాజీ రాష్ట్రపతి కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాయచోటి అర్బన్ : యువత ఆదర్శప్రాయుడైన భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అడుగుజాడల్లో నడవాలని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అన్నారు. అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఆయన విగ్రహానికి మున్సిపల్ చైర్మన్, వైఎస్‌ఆర్‌సీపీ నేతలతో కలసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అబ్దుల్ కలాం ఆదర్శప్రాయుడన్నారు. క్షిపణుల తయారీ, అంతరిక్ష ప్రయోగాలలో కలాం చేసిన కృషి కారణంగా భారతదేశం ప్రపంచంలోనే ఉన్నతస్థానంలో ఉందన్నారు. తన నిజాయితీ, సౌమ్యతతో రాష్ట్రపతి పదవికి సైతం కలాం వన్నెతెచ్చారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ వెంకట క్రిష్ణారెడ్డి, కౌన్సిలర్లు గౌస్‌ఖాన్, అల్తాఫ్, ఆసిఫ్ అలీఖాన్, వైఎస్‌ఆర్‌సిపి నేతలు రియాజ్,ఫయాజ్ అహమ్మద్, ఉమర్, ఇషాక్, సైపుల్లా, జమాల్‌లు పాల్గొన్నారు.


రాయచోటి అర్బన్: అబ్దుల్‌కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

ఆదర్శనీయుడు అబ్దుల్ కలాం..

అందరికి ఆదర్శప్రాయుడు భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం అని సాయి ఇంజనీరింగ్ కళాశాల ఏడీ డాక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో పుట్టినప్పటికీ తనకున్న ప్రతిభా పాటవాలతో అత్యున్నత రాష్ట్రపతి పదవిని అలంకరించిన గొప్పవ్యక్తి అన్నారు. మిస్సైల్‌మాన్‌గా పేరుగాంచి భారత సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన అసమాన ప్రజ్ఞాశీలి అంటూ కొనియాడారు. ప్రతి విద్యార్థి అబ్దుల్‌కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

చిట్వేలి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం భారతరత్న అబ్దుల్ కలాం 92వ జయంతిని ఘనంగా నిర్వహించారు. 30వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా కలాం లాంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ఉపాధ్యాయులు దుర్గరాజు, యుగంధర్, శ్రీనివాసులు, ఎన్‌సీసీ కేడెట్లు యజ్ఞధర్, ముజాహిద్, రామ్ శరణ్, కుసుమితలు అబ్దుల్ కలాం సేవలను గుర్తు చేస్తూ ప్రసంగించారు.

దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి

రాయచోటి అర్బన్ : పట్టణంలో విపరీతంగా పెరిగిపోతున్న దోమల నివారణకు మున్సిపల్ అధికారులు వెంటనే ఫాగింగ్ చేయాలని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ మాజీ సభ్యుడు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పట్టణంలో అపరిశుభ్రత కారణంగా దోమల మోత ఎక్కువై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే అధికారులు మున్సిపల్ పరిధిలోని మురుగునీటి కాలువలను శుభ్రపరచడం, ఫాగింగ్ చేయడం ద్వారా దోమల నివారణకు కృషిచేయాలంటూ కోరారు.

సంక్షేమంతోనే రాష్ట్ర అభివృద్ధి

రామాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలలో భాగంగా సంక్షేమ పథకాలు ప్రజలలో నాటుకుపోయాయని జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి షేక్ జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినప్పటికీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేయడం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో రాయచోటి నియోజకవర్గంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలుస్తారని తెలిపారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో దేశంలోని మొదటి స్థానంలో ఉందారన్నారు. ఆయనతోపాటు మండల మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, జాఫర్, జమీల్, ఇంతియాజ్, చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు


బీ.మురళీ, అధ్యక్షుడు


రామచంద్రయ్య, కార్యదర్శి

నందలూరు(రాజంపేట) : నందలూరు రైల్వే కేంద్రంలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం నాగిరెడ్డిపల్లెలోని రైల్వే క్వార్టర్స్‌లోని పెన్షన్ కార్యాలయంలో నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఇందులో అధ్యక్షుడిగా బి.మురళీ, కార్యదర్శిగా ఆవుల రామచంద్రయ్య, కోశాధికారిగా గుడిసె కనకదుర్గయ్యలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సలహాదారులుగా జీకె సింగ్, బి.ఎల్లారెడ్డి, హజంతుల్లాఖాన్‌లు నియమితులయ్యారు. ఈ సమావేశంలో రైల్వేపెన్షనర్లు, కార్మికులు పాల్గొన్నారు.

నూతన చర్చి ప్రారంభం


వాక్య సందేశం ఇస్తున్న రెవ.కె.జ్ఞానప్రకాశం

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామంలో నూతనంగా పీటర్స్ సెయింట్ లూథరన్ నూతన చర్చిని ప్రారంభించారు. ఆదివారం ఫాస్టర్ రెవెరెండ్ కె. జ్ఞానప్రకాశం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మారుమనస్సు పొంది దైవ చిత్తనుసారం నడుచుకోవాలని తెలియజేశారు. ప్రత్యేక ప్రార్థనలో జాకబ్, సుధాకర్, జీవయ్య, యోహాన్, తదితర సంఘ పెద్దలు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల రక్షణకు ఉద్యమిద్దాం

రాయచోటి అర్బన్ : కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సమష్టిగా ఉద్యమిద్దామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలంటూ వారు మున్సిపల్ కార్మికులతో కలసి ఆదివారం పట్టణంలోని పాత రాయచోటిలో కరపత్ర ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ కార్మికులు ఎన్నో ప్రాణత్యాగాలు, పోరాటాలు చేసి హక్కులను సాధించుకున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులు, చట్టాలను కాలరాస్తోందన్నారు. కార్మికవర్గం తమ హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం పోరాటాలు చేయవలసి వుందన్నారు. కార్మికులకు అండగా నిలుస్తున్న ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి సుధీర్, ఏఐటీయూసీ నేతలు పుల్లయ్య, వెంకటేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు శేషాద్రి, అబ్దుల్లా, ఆంజనేయులు, రమణ, లలితమ్మ, మౌనిక, రజని, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పాత రాయచోటిలో కరపత్ర ప్రచారం చేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు

అంబేడ్కర్ విగ్రహావిష్కరణపై సంబరాలు

మదనపల్లె : అమెరికాలో స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ పేరుతో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడంపై వీసీకే పార్టీ, భారతీయ అంబేడ్కర్ సేన ఆధ్వర్యంలో పట్టణంలో సంబరాలు నిర్వహించారు. అమెరికాలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరుగుతున్న సమయంలో భారత కాలమానం ప్రకారం శనివారం రాత్రి 8.30 గంటల నుంచి అర్ధరాత్రి 12 వరకు బాణాసంచా పేలుస్తూ, ఉత్సాహభరితంగా కార్యక్రమం జరిపారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీయం.శివప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఖ్యాతి విశ్వవ్యాప్తం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. అగ్రరాజ్యం అమెరికాలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు భారతీయులందరికీ గర్వకారణమన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

లక్కిరెడ్డిపల్లె : వర్షాలు కురిపించి ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడు గంగమ్మతల్లి అంటూ ఆదివారం అనంతపురం గంగమ్మకు భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ పూజారులు ఆదిమూలం వంశీయులు రెడ్డి శేఖర్, చంద్రశేఖర్‌లు అమ్మవారికి అభిషేకం చేయడంతోపాటు కుంకుమార్చనలు చేసి ప్రత్యేక పూజలు చేశారు.

దుర్గా మాతకు పూజలు

సిద్దవటం : మండలంలోని సాయినగర్ గ్రామంలోని శ్రీ భద్రావతి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం దుర్గా దేవికి ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహ దాతలు పుత్తా రామభద్రయ్య, వారి కుమారులు పుత్తా నాగభూషణం, పుత్తా బాబు, ప్రజలు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వేద పండితులు అమర్‌నాథ్ శర్మ అమ్మవారికి శరన్నవరాత్రుల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దుర్గామాత భక్తులకు బాలత్రిపురసుందరి అలంకరణలో దర్శనమిచ్చారు.

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లిలోని కడప-చెన్నై జాతీయ రహదారిపై వెలసిన శ్రీ సత్యమ్మకు, అలాగే పుల్లంపేట మెయిన్ రోడ్డులో వెలసిన శ్రీ మారమ్మకు దసరా ఉత్సవాలలో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యమ్మ, మారమ్మ అమ్మవార్లు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున అమ్మవార్లను దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు.


రాజంపేట: అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తదితరులు

కనకదుర్గను దర్శించుకున్న ఎమ్మెల్యే మేడా

రాజంపేట : దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా రాజంపేట శివారు గ్రామమైన వెంకటరాజంపేటలో ఆదివారం కనకదుర్గ అమ్మవారిని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. నియోజకవర్గ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు కలగాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అమ్మవారి ఆశీర్వాదాలు కలగాలని కోరుకున్నామన్నారు. ఈయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పృథ్వీరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, సర్పంచ్ ఈశ్వరయ్య, కుందానెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, హస్తవరం ఉమామహేశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ, భార్గవ్, అశోక్, సుబ్బరాయుడు, కొమ్మినేని శివ, సుధాకర్, వెంకటరాజంపేట గ్రామస్తులు పాల్గొన్నారు.

'మజ్దూర్ యూనియన్‌ను గెలిపించండి'

నందలూరు (రాజంపేట) : ఈనెల 19వ తేదీ జరగనున్న రైల్వే సహకార సొసైటీ పాలకమండలి ఎన్నికలలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్‌ను బలపరుస్తున్న 28 మంది డెలిగేట్‌లకు తమ ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గుంతకల్ డివిజినల్ ప్రెసిడెంట్ కె.సుదర్శన్ రాజు నందలూరు, హస్తవరం, రాజంపేట, పుల్లంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలలో ఉన్న రైల్వే సొసైటీ సభ్యులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ లాభాలలో ఉండాలన్నా, ఎటువంటి లంచం తీసుకోకుండా సభ్యులకు లోన్ ఇవ్వాలన్నా, సొసైటీ అభివృద్ధి చెందాలన్నా, ప్రతి సంవత్సరం సభ్యులకు డివిడెంట్ కచ్చితంగా అందాలన్న అది ఒక సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్‌కు మాత్రమే సాధ్యమన్నారు. కార్యక్రమంలో చైర్మన్ పి.గోపినాథ్, సెక్రటరీ కె.విశ్వనాథ్, ట్రెజరర్ ఎస్.వెంకట సుబ్బయ్య, ఎం.శ్రీ హర్ష, మహబూబ్ బాషా, సుధీర్, సిద్దయ్య, షేక్ షావలి, నారాయణ, డెలిగేట్‌గా పోటీ చేయుచున్న పి.గురు వినోద్ కుమార్, రవీంద్ర నాయక్‌లు పాల్గొన్నారు.


ఓటును అభ్యర్థిస్తున్న మజ్దూర్ సంఘం నాయకులు

విద్యారంగ పరిరక్షణకు ఉద్యమబాట

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకై సమష్టిగా ఉద్యమబాట పడదామని ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఆర్‌ఎస్‌యూ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం ప్రమాదంలో ఉందన్నారు. విద్యారంగ పరిరక్షణకు రాబోయే కాలంలో ఉమ్మడిగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల విద్యలో మార్పుల వలన గ్రామీణ ప్రాంతాల్లోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. అనంతరం ఆయన ఆర్‌ఎస్‌యూ జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా చంద్రకాంత్, ప్రధానకార్యదర్శిగా వీరాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా వంశీ, గోవర్ధన్, సహాయ కార్యదర్శిగా రెడ్డెయ్య, సభ్యులుగా కిరణ్, ప్రమోద్, సాయి, సుబ్బయ్య తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్, జిల్లానేతలు సుబ్రమణ్యం, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గంతో రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి

ప్రవక్త మార్గం అనుసరణీయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రవక్త మహమ్మద్ (సా.అ.వ) మార్గం అనుసరణీయమని కార్పొరేటర్ చల్లా రాజశేఖర్ తెలిపారు. మహమ్మద్ ప్రవక్త జన్మదిన మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కడప నగరం రవీంద్రనగర్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవక్త ఒక్క ముస్లిం సమాజానికే కాకుండా మానవాళిని సన్మార్గంలో నడిపేందుకు వచ్చారన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.